క్లుప్తంగా

గోపా జిల్లా సంయుక్త కార్యదర్శిగా ముత్యంరాజు



శాలిగౌరారం: గోపా (గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) జిల్లా సంయుక్త కార్యదర్శిగా శాలిగౌరారం మండలంలోని ఊట్కూరు గ్రామానికి చెందిన రంగు ముత్యంరాజు ఎన్నికయ్యారు. నల్లగొండలోని గౌడ విద్యార్థి హాస్టల్ భవనంలో సోమవారం గోపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్నగౌడ్ సమక్షంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు.

సభ్యత్వ నమోదు

నాంపల్లి: మండలంలోని ఆదర్శ పాఠశాల పెద్దాపురం, నాంపల్లి, దామెర, గట్ల మల్లేపల్లిలోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు చేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్ర శేఖర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి గేర నర్సింహులు, మండల అధ్యక్షుడు జింకల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కస్పరాజు వెంకన్న, కృష్ణవేణి, శ్రవణ్‌కుమార్, యాదయ్య, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, అరుణ పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. శ్రీనివాస్‌రెడ్డికి బ్యాంకు సిబ్బంది, పలువురు నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాశం సంపత్‌రెడ్డి, కొండా సైదయ్య, కె వీరస్వామి, ధనావత్ జయరాం, కోడి సుష్మవెంకన్న, శంకర్‌రావు, బ్యాంకు జీఎం నర్మద పాల్గొన్నారు.

దుకాణాల వేలం

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామ పంచాయతీ పరిధిలో 8 షాపులకు సోమవారం వేలం పాట నిర్వహించినట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి రవీందర్‌రెడ్డి తెలిపారు. వేలంలో 60 మంది పాల్గొని 8 షాపులకు టెండర్ వేయగా ఆరుగురు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. వేలం ద్వారా గ్రామ పంచాయతీకి రూ.12 లక్షల ఆదాయం వచ్చినట్లు వివరించారు. డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఉమేష్, ఎంపీఓ సుధాకర్ పాల్గొన్నారు.

లారీ ఓనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

చిట్యాల: లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చిట్యాల లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన జగిని భిక్షంరెడ్డి అన్నారు. చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామ పరిధిలోని లారీ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లారీ ఓనర్స్ అసోసియేషన్‌లో 64 మంది సభ్యులు ఉండగా 45 మంది సభ్యులు తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జమాండ్ల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ఆవుల మల్లేష్, కోశాధికారి గురిజ జంగయ్య, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుల నిరాహార దీక్ష



నిరాహార దీక్ష చేస్తున్న గీత కార్మికులు

నల్లగొండ టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కల్లుగీత కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష చేశారు. ప్రమాదానికి గురైన వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కల్లుగీత కార్మికులందరికీ కాటమయ్య కిట్లు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు గుండా అబ్బాలు, కొండ వెంకన్న, రాచకొండ వెంకట్ గౌడ్, కొప్పుల అంజయ్య పాల్గొన్నారు.

నిరుపయోగంగా బస్ షెల్టర్లు

- బస్‌బేలలోకి వెళ్లని ఆర్టీసీ బస్సులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

కేతేపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో 65 నంబరు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ల వద్ద బస్సులు నిలపకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తయిన తర్వాత కేతేపల్లి, కొర్లపహాడ్, చీకటిగూడెం, ఉప్పలపహాడ్ గ్రామాల్లో బస్‌షెల్టర్లను నిర్మించారు. బస్‌షెల్టర్ల వద్ద బస్సులు నిలిపినపుడు జాతీయ రహదారిపై వెళ్లే ఇతర వాహనాలకు ఆటంకం కలుగకుండా బస్‌షెల్టర్ల సమీపంలో బస్‌బేలు సైతం ఏర్పాటు చేశారు. అయితే ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన బస్‌బేలలోకి వెళ్లకుండా డ్రైవర్లు బస్సులను రోడ్డుపైనే నిలుపుతున్నారు. ఉప్పలపహాడ్ వద్ద గ్రామానికి దూరంగా బస్‌షెల్టర్ ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు అక్కడి వరకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. చీకటిగూడెం, కొర్లపహాడ్ గ్రామాల్లో బస్‌షెల్టర్లు నిరుపయోగంగా మారడంతో రైతులు ధాన్యం ఆరబోసేందుకు కల్లాలుగా ఉపయోగించుకుంటున్నారు. ఇక మండలకేంద్రం కేతేపల్లిలో జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్లపై బస్‌షెల్టర్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ స్టాపు ఉన్న బస్సులను గ్రామంలోకి ప్రవేశించడానికి ముందే సర్వీసు రోడ్లపైకి మళ్లించాలి. అలా కాకుండా ఆర్టీసీ బస్సులను సర్వీసు రోడ్లపైకి తీసుకు రాకుండా డ్రైవర్లు నేరుగా హైవే పైనే నిలుపుతున్నారు.



చీకటిగూడెం బస్‌షెల్టర్‌లో నిలిపిన లారీలు



కొర్లపహాడ్ బస్‌షెల్టర్‌లో ధాన్యం రాశులు (ఫైల్)

తరచూ ప్రమాదాలు..

హైవేపై బస్‌షెల్టర్ల వద్ద బస్సులను నిలపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు గంటల తరబడి ఎండలో ఎండుతూ, వర్షానికి తడుస్తూ రోడ్డుపైనే నిరీక్షిస్తుండడంతో అస్వస్థతకు గురవుతున్నారు. హైవేపై బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. బస్‌షెల్టర్లు నిరుపయోగంగా ఉండడంతో మాంసం విక్రయదారులకు, తాగుబోతులకు, భిక్షగాళ్లకు అడ్డాగా మారాయి. అధికారులు స్పందించి బస్సులను బస్‌షెల్టర్ల వద్ద నిలిపేలా చర్యలు తీసుకోవాలని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎండలో నిలబడాల్సి వస్తోంది



బస్సులు బస్‌బేలోకి రాకపోవడం వల్ల ప్రయాణికులు ఎండలో నిలబడాల్సి వస్తోంది. రోడ్డు పక్కనే ఉండాల్సి రావడంతో ప్రయాణికులు ప్రమాదాలబారిన పడుతున్నారు. బస్సులు నిలపకపోవడంతో సర్వీస్ రోడ్లపై ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్లు నిరుపయోగంగా మారాయి.

– చిలుకూరి అంజయ్య, కొర్లపహాడ్

బస్ షెల్టర్ల వద్ద బస్సులు ఆపాలి



కేతేపల్లిలోని పాఠశాలల్లో చదువుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రతిరోజు విద్యార్థులు వస్తుంటారు. బస్‌షెల్టర్ వద్దకు బస్సులు రాకపోవడంతో విద్యార్థులు ఎండలోనే నిలబడుతున్నారు. బస్‌షెల్టర్ వద్ద బస్సులు నిలిపేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– తాడోజు నర్సింహాచారి, కేతేపల్లి

న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటుకు కృషి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

రామగిరి(నల్లగొండ): న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటుకు కృషి చేస్తానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, బార్ కౌన్సిల్ ఇండియా మాజీ సభ్యుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. నల్లగొండ బార్ అసోసియేషన్ కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులకు ప్రజలతో ఎక్కువ సంబంధాలు ఉంటాయని, రాజకీయాల్లో రాణించి ప్రజలకు సేవ చేయాలని సూచించారు. న్యాయవాద వృత్తిలో ఉన్న వ్యక్తికి రాజకీయ పదవి రావడంపై నల్లగొండ బార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని న్యాయవాదులు రామచందర్‌రావు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కట్టా అనంతరెడ్డి, జనరల్ సెక్రటరీ మందా నగేష్, సీనియర్ న్యాయవాదులు పి.శ్యాంసుందర్, ఎం.రాంచందర్‌రావు, గోలి అమరేందర్‌రెడ్డి, మేరెడ్డి నర్సింహారెడ్డి, జి. వెంకటేశ్వర్లు, ఎస్.రఘుపతి, కంచనపల్లి జవహర్, జి.జవహర్, టి.కిశోర్‌కుమార్, నామిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన రామచందర్‌రావు

చిట్యాల: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు నల్లగొండలో జరిగే పార్టీ కార్యక్రమానికి వెళుతూ మార్గమధ్యలో చిట్యాలలో సోమవారం కాసేపు ఆగారు. ఈ సందర్భంగా ఆయనకు బీజేపీ మండల అధ్యక్షుడు పీక వెంకన్న, పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి రామచందర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. రామచందర్‌రావు వెంట మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నకిరేకంటి మొగులయ్య, మాస శ్రీనివాస్, చికిలంమెట్ల అశోక్, రుద్రవరం లింగస్వామి, కంబాలపల్లి సతీష్‌కుమార్, కన్నెబోయిన మహాలింగం, కూరెళ్ళ శ్రీను, పల్లె వెంకన్నగౌడ్, చంద్రారెడ్డి, గంజి గోవర్ధన్ పాల్గొన్నారు.



నల్లగొండలో రామచందర్‌రావును సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

రామచందర్‌రావుకు ఘన స్వాగతం

నార్కట్‌పల్లి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు నల్లగొండ పర్యటనకు వస్తున్న సందర్భంగా సోమవారం నార్కట్‌పల్లిలో బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. శాలువా కప్పి సన్మానించారు. అనంతరం రామచందర్‌రావు సమక్షంలో బండారు రవీందర్, పలువురు కార్యకర్తలు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్, పజ్జూరి వెంకట్‌రెడ్డి, బిల్లకంటి శ్రీకాంత్, అక్కెనపల్లి సత్తయ్య, పురుషోత్తంరెడ్డి, పాల్వాయి భాస్కరరావు, కొరివి శంకర్, మునుకుట్ల గణేశ్, నల్లగొండ నాగరాజు, పల్లెర్ల నాగరాజు, పాలకూరి రమేష్, బామండ్లపల్లి ఉపేందర్, మల్లబోయిన రామలింగం, పంజాల శేఖర్, వనం శంకర్, నడిపెల్లి పార్థసారథి, గండికోట శ్రీకాంత్, కొత్త మహేష్, శివ, కల్లూరి కార్తీక్, యాట చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉచిత విద్య అందించడం అభినందనీయం

- మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నకిరేకల్ : ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో నకిరేకల్ పట్టణంలో ఉద్దీపన స్కూల్‌ను స్థాపించి పేద వర్గాలకు చెందిన 300 మంది పిల్లలకు ఉచితంగా నర్సరీ నుంచి ఏడో తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం విద్య, భోజన వసతి కల్పించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ అలుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. నకిరేకల్‌లోని ఉద్దీపన (వీవీఎం ఎయిడెడ్) స్కూల్‌ను సోమవారం ఆయన సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉద్దీపన ఫౌండేషన్ కోఆర్డినేటర్ చెరుకు సతీష్, కరస్పాండెంట్ గంగధారి భద్రయ్య, హెచ్ఎం శేషగోని రామయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నేడు నాటక ప్రదర్శన

రామగిరి(నల్లగొండ): బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ నల్లగొండ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాదు వారు మంగళవారం నల్లగొండలోని వల్లపురెడ్డి కోటిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో బుద్ధుడితో నా ప్రయాణం అనే నాటకం ప్రదర్శన చేయనున్నారు. ఈ నాటక ప్రదర్శనకు ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు సంకు హరి, మండల ఆంజనేయులు పేర్కొన్నారు.

18 నుంచి ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్

నకిరేకల్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నకిరేకల్‌లోని మినీ స్టేడియంలో ఈ నెల 18 నుంచి 24 వరకు ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. నకిరేకల్‌లో సోమవారం టోర్నమెంట్ నిర్వాహకుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్‌తో కలిసి ప్రచార కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఈ నెల18న జగదీష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా టోర్నమెంట్ ప్రారంభమవుతుందన్నారు. 24న కేటీఆర్ జన్మదినం సందర్భంగా టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రథమ బహుమతి రూ.1,00,116, రెండో బహుమతి రూ.50,116 ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నార్కట్‌పల్లి మాజీ ఎంపీపీ నరేందర్‌రెడ్డి, చల్ల కృష్ణారెడ్డి, ఊట్కూరి ఏడుకొండలు, నూక సైదులు, గుండాల మల్లేష్‌గౌడ్, చెరుకు వెంకటాద్రి, చౌగోని శంకర్, వంటిపాక సుందర్, యాతాకుల సోమయ్య, శ్రీను, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సాధనతో విజయం సొంతం



నకిరేకల్: మాట్లాడుతున్న మెజీషియన్ రామకృష్ణ

నకిరేకల్: నిరంతర సాధనతో చదువు, ఇతర రంగాల్లో విజయం సాధ్యమవుతుందని ప్రముఖ మెజీషియన్ జి.రామకృష్ణ అన్నారు. నకిరేకల్‌లోని ఉద్దీపన స్కూల్‌లో నకిరేకల్ లయన్స్ సెంటినియల్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన యాంటీ డ్రగ్స్ సెల్‌ఫోన్ ఎడిక్ట్ నివారణ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఓటమికి కృంగిపోకుండా లోపాలు తెలుసుకుని రెట్టించిన ఉత్సాహంతో విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాలకు బానిసలయితే శారీకంగా, మానసికంగా ఇబ్బందులు పడతారని అన్నారు. సెంటినియల్ క్లబ్ అధ్యక్షుడు కందాల ప్రేమ్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ ప్రతినిధి డాక్టర్ యానాల మోహన్‌రెడ్డి, ప్రోగాం చైర్మన్ రావిరాల అశోక్, చార్టర్ ప్రెసిండెంట్ యానాల రజనీకాంత్ రెడ్డి, ప్రతినిధులు బాణాల రాంరెడ్డి, కందాల వెంకట్ రెడ్డి, యానాల రాంరెడ్డి, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం రాములు, పాఠశాల కరస్పాండెంట్ భద్రయ్య, త్కురి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

నార్కట్‌పల్లి: విద్యార్థులు డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలని మోటివేషనల్ స్పీకర్ గూడూరు అంజిరెడ్డి అన్నారు. సోమవారం అమ్మనబోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డ్రగ్స్, మత్తు పదార్థాల వల్ల అనారోగ్యం బారిన పడతామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ప్రకాష్, కావేరి, అనురాధ, శ్రీదేవి, రాములమ్మ, లక్ష్మారెడ్డి, లక్ష్మమ్మ, లింగయ్య, విజయ్‌కుమార్, నుస్రత్, బాలాభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు తలారి రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక బస్సు చొప్పున ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు పాఠశాలలపై ఆసక్తి పెరుగుతుందన్నారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బోగోజు మహేశ్వరాచారి, యాతాకుల వెంకన్న, వంటిపాక వినోద్, మామిడి జగన్, తరి ఎల్లయ్య, వంటిపాక శ్రీను, పుల్లెంల శంకర్, కళ్యాణ్‌గౌడ్, లింగయ్య, రెమిడాల వెంకటేశ్, సతీష్, కృష్ణయ్య, రవి, సైదులు వంశీ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు

అనారోగ్యంతో డయాలసిస్ వార్డు ఇన్‌చార్జ్ మృతి



నవీన్(ఫైల్)

మర్రిగూడ: ఇటీవల అనారోగ్యానికి గురైన మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రి డయాలసిస్ వార్డు ఇన్‌చార్జ్ భూతం నవీన్ (27) హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందారు. నవీన్ స్వస్థలం నాంపల్లి మండలంలోని మల్లపురాజుపల్లి గ్రామం.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చిట్యాల: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చిట్యాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సత్య నరేష్ అన్నారు. చిట్యాల మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య ఆరోగ్య సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నర్సింగరావు, మున్సిపల్ మేనేజర్ ఫాతిమా, ఎంపీఓ సత్యనారాయణ, సీడీపీఓ వెంకటమ్మ, ఎంపీఓ సైదానాయక్ పాల్గొన్నారు.

టై, బెల్టు, బూట్లు పంపిణీ

నార్కట్‌పల్లి: మండలంలోని ఏపీ లింగోటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఆ పాఠశాల ఉపాధ్యాయురాలు కంచర్ల వినోద టై, బెల్టు, బూట్లు అందజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ వంగాల పల్లవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లేపల్లి కాశయ్య, వస్తుపుల చంద్రయ్య పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం

గట్టుప్పల్: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని సీడీపీఓ లావణ్య అంగన్‌వాడీ సిబ్బందిని హెచ్చరించారు. గట్టుప్పల్ మండలంలోని తేరటుపల్లి మొదటి అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీచర్ ఉషారాణి, ఆయా చిన్నారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రుజువు కావడంతో టీచర్‌కు, ఆయాకు మెమో జారీ చేస్తున్నట్లు సీడీపీఓ తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండ టౌన్: ముదిగొండ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌కు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో సుమారు 15 మంది గిరిజన బాలికలు అనారోగ్యం పాలయ్యారన్నారు.

గౌడ సంఘం నాయకుల ముందస్తు అరెస్ట్

శాలిగౌరారం: గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తిరుమలగిరిలో సీఎం బహిరంగ సభను అడ్డుకునే కార్యక్రమం చేపడుతున్నారనే సమాచారంతో పోలీసులు గౌడ సంఘం నాయకులను సోమవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన సర్వాయి పాపన్న, మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడు కుంభం నర్సింహ, గౌడ యువజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మల సురేశ్ ఉన్నారు. సాయంత్రం వారిని వ్యకిగత పూచీకత్తుపై పోలీసులు విడుదల చేశారు.

‘ఫుడ్ పాయిజన్’ పై విచారణ జరిపించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నల్లగొండ టౌన్ : దేవరకొండ గిరిజన ఆశ్రమ పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా హెచ్‌డబ్ల్యూఓ స్థానికంగా ఉండడం లేదని, ఆయనపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు ప్రభుత్వమే వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో ఆకారపు నరేష్, కమ్మంపాటి శంకర్, సైదానాయక్, కిరణ్, సూర్య, రవీందర్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని..

నల్లగొండ: దొంగల బెడదను అరికట్టడానికి నల్లగొండ పట్టణంలోని 18,19 వార్డుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.20 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కొండూరు సత్యనారాయణ సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ వార్డులకు సమీపంలో అద్దంకి బైపాస్ రోడ్డు, రైల్వే స్టేషన్ ఉండడంతో దొంగలకు చోరీలు చేయడం సులభమైందన్నారు. కాలనీల్లో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని కోరారు.

మున్నూరు కాపులపై దాడిచేస్తే సహించేది లేదు

నల్లగొండ టౌన్ : మున్నూరు కాపు ప్రజాప్రతినిధులపై దాడులకు పాల్పడితే సహించేది లేదని మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు వాసుదేవుల వెంకటనర్సయ్య అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడి చేసి ఆయనను గాయపర్చడాన్ని సంఘం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. మున్నూరు కాపులు రాజకీయంగా ఎదుగుతుండడాన్ని జీర్ణించుకోలేక అగ్రవర్ణాలు దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం పట్టణ అధ్యక్షుడు జువ్వాజి ఇంద్రయ్య, నాయకులు చామల కేశవ్, మారబోయిన చంద్రయ్య, చందల చంద్రశేఖర్, పందిరి వేణు, శ్యామల సత్తయ్య, నాగులపల్లి శ్యాంసుందర్, వీరమల్ల భాస్కర్, కోట్ల రామలింగం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాసుదేవుల వెంకటనర్సయ్య

శివారు గ్రామాలకు తరలిన బెల్టు షాపులు !



కల్వపల్లి గ్రామ శివారులోని దోమలపల్లి పొలిమేరలో ఏర్పాటు చేసిన బెల్టు షాపు

మునుగోడు: యువత, నిరుపేదలు మద్యానికి బానిసలై ఆ కుటుంబాలు చిన్నాభిన్నం కాకూడదనే ఆలోచనతో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని గ్రామాల్లోని బెల్టు షాపులను రద్దు చేయించారు. దీంతో మునుగోడు నియోజకవర్గంలోని గ్రామాల్లో మద్యం విక్రయాలు తగ్గి మద్యం ప్రియుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతోంది. నిరుపేదలు తాము పనిచేసి సంపాదించిన నగదును పోగుచేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. అయితే కొందరు వ్యాపారులు ఎలాగైనా తమ బెల్టు దుకాణాలు నడిపించాలనే ఆలోచనతో మునుగోడు నియోజకవర్గంలోని శివారు గ్రామాల పొలిమేరల్లో ప్రత్యేక షెడ్లు ఏర్పాటుచేసి బెల్టు దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ప్రధాన రహదారికి ఆనుకుని రైతుల భూములను లీజుకు తీసుకుని పట్టణ కేంద్రాల్లో ఉండే బార్ల లాగా నిర్మించారు. మద్యం ప్రియులు తినేందుకు వివిధ రకాల వంటకాలను సైతం అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో మునుగోడు నియోజకవర్గంలోని శివారు గ్రామాల్లో ఈ బెల్టు దందా మూడు పువ్వులు, ఆరు కాయల్లాగా కొనసాగుతోంది. సంబంధిత అధికారులు, ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వ అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా శివారు గ్రామాల్లో కొనసాగిస్తున్న బెల్టు దందాకు బ్రేక్ వేయించాలని పలువురు మహిళలు కోరుతున్నారు.

గోరింటాకు వేడుక



రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని ముషంపల్లి రోడ్డు ధాత్రి నగర్‌లో గోరింటాకు వేడుకను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. కాలనీకి చెందిన మహిళలు గోరింటాకు చెట్టుకు పూజలు నిర్వహించి చేతులకు గోరింటాకు పెట్టుకుని సంబరాలు చేసుకున్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

శాలిగౌరారం: మండలంలోని ఉప్పలంచ గ్రామానికి చెందిన మందుల పరశురాములు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. దీంతో అతడితోపాటు శాలిగౌరారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2001–02 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన స్నేహితులు సోమవారం ఉప్పలంచలో పరశురాములు కుటుంబాన్ని పరామర్శించి రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో తోట శ్రవణ్‌కుమార్, మందుల బాలకృష్ణ, పరశురాం, రాము, నాగార్జున్, శ్రీను, శంకర్, సుజాత, శోభ, ఉమా, జానకమ్మ, నరసింహ, సైదులు, అనిల్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



పరశురాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్నేహితులు

వర్షాలు కురవాలని గ్రామ దేవతలకు పూజలు



అభిషేకం చేయడానికి బిందెలతో నీటిని తీసుకెళ్తున్న మహిళలు

చండూరు: వర్షాలు కురవాలని కోరుతూ చండూరు మండలంలోని బంగారిగడ్డ గ్రామంలో సోమవారం గ్రామస్తులు గ్రామదేవతలకు నీళ్లతో అభిషేకం చేశారు. గ్రామంలోని బొడ్రాయి, ముత్యాలమ్మ, ఎల్లమ్మ, కనకదుర్గ, కాటమయ్య దేవుళ్లకు నీళ్లతో అభిషేకం చేశారు. బొడ్రాయి వద్ద బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో గ్రామస్తులు సుంకరి చెన్నయ్య, కాటపల్లి యాదయ్య, బోయపల్లి లక్ష్మయ్య, బోయపల్లి వెంకటేశం, పల్లె రాజు, పల్లె వెంకన్న, మహిళలు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి నిర్మించుకోవాలి

మునుగోడు: గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం అమలు చేసేందుకు ప్రతి ఇంటిలో మరుగుదొడ్డి నిర్మించుకోవాలని స్వచ్ఛ భారత్ మిషన్ సభ్యుడు మోహినుద్దిన్ సూచించారు. సోమవారం మునుగోడు మండలంలోని ఊకొండి గ్రామంలో స్వచ్ఛ భారత్ మిషన్ అధికారులు పలు ఇళ్లు, ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంటిలో మరుగుదొడ్డి, ఇంకుడు గుంత నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ టీమ్ లీడర్ అశోక్‌రెడ్డి తహసీల్దార్ ఎన్.నరేష్, ఎంపీడీఓ విజయభాస్కర్ పాల్గొన్నారు.